ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 9 సెప్టెంబరు 2024



నేడు పాఠశాలలకు సెలవు

పార్వతీపురం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా సోమవారం జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున స్కూళ్లకు సెలవు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా, మండల విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో తమ సిబ్బందికి తగు ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులు బయటకు రాకుండా తల్లిదండ్రులు చూడాలని ఆయన సూచించారు.



అపిలి వద్ద ఉధృతంగా నాగావళి నది

కుండపోత

- జిల్లాలో భారీ వర్షాలు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- నీటమునిగిన వరి పొలాలు
- నదులు, చెరువులకు వరద
- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం



భామిని: సింగిడి వద్ద రోడ్డుపై గుంతల్లో చేరిన నీరు

పార్వతీపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి)/ పాలకొండ: వాయుగుండం కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేని వాన కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రోజంతా కుండపోత వర్షం పడింది. దీంతో జనజీవనం స్తంభించింది. ప్రజలంతా ఇళ్లకే పరిమిత మయ్యారు. మరోవైపు లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయి. ప్రధాన రోడ్లు, కూడళ్లలో నీరు నిలిచింది. దీంతో వాహన దారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. చెరువులు, నదులు, వాగులు, వంకలకు వరద పోటెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు రిజర్వాయర్ల గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురుస్తున్నాయన్న వాతావరణ శాఖల హెచ్చరికల నేపథ్యంలో జిల్లావాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులు కూడా తమ పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఇదిలా ఉండగా నాగావళి, వంశధార పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వారికి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాలకొండ డివిజన్‌లో కురిసిన భారీ వర్షానికి కొండ వాగులు, గెడ్డలు ఉప్పొంగుతున్నాయి. ప్రధానంగా పాలకొండ మండలంలో జంపరకోట గెడ్డ, రావాడగడ్డ, గజిలిగెడ్డ, ఓనిగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన ఉన్న ఒడిశాతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో జోరు వాన కురుస్తుండగా.. మరోవైపు విజయనగరం జిల్లాలోని మడ్డువలస, మన్యం జిల్లాలో తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీరు విడిచిపెట్టడంతో నాగావళి నదికి వరద పోటెత్తింది. దీంతో పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో ఉన్న రాజుపేట జంక్షన్ వద్ద, వీపీరాజుపేట, తుమరాడ, తంపటాపల్లి, బుక్కూరు, పాలకొండ, గోపాలపురం, మంగళాపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రెండు మూడు రోజుల పాటు పొలాలు నీటిలోనే ఉంటే పంట కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జలమయమైన కాలనీలు...

పాలకొండలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. పట్టణంలోని మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం, పోతలగెడ్డ బ్రిడ్జి వద్దకు అధిక మొత్తంలో వరదనీరు చేరడంతో గాయత్రీకాలనీ, వడమ కాలనీ, గారమ్మకలనీ, సెగిడి వీధి, ఎన్‌ఎస్‌ఎన్ కాలనీలు ముంపునకు గురయ్యాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా నగర పంచాయతీ సిబ్బంది కొన్ని కాలనీల్లో ఇసుక బస్తాలు వేసి వరదనీటికి అడ్డుకట్ట వేస్తున్నారు. మరోవైపు టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో పోతలగెడ్డలో పూడికలు తొలగించారు.

నాగావళి, వంశధారకు వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో ఆదివారం నీటి ప్రవాహం నిలకడగానే ఉంది. సుమారు 2,200 క్యూసెక్కులు నదిలోకి చేరగా.. వాయుగుండం హెచ్చరికలతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. సుమారు 1,900 క్యూసెక్కులను దిగువకు మళ్లించామని జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్‌లు తెలిపారు. వర్షాల నేపథ్యంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువలో గండ్లు పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సాగునీటి సరఫరాను నిలుపుదల చేసినట్లు తోటపల్లి ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రఘునాథనాయుడు చెప్పారు. ఎడమ ప్రధాన కాలువ నుంచి 250 క్యూసెక్కులు, పాత రెగ్యులేటర్ పరిధి లోని కుడి కాలువ నుంచి 60 క్యూసెక్కులను విడుదల చేశారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.80 మీటర్ల నీటి సామర్థ్యం ఉంది. ● **భామిని:** మరోవైపు వంశధార నదిలో వరద పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పొలాలతో పాటు అలికాం-బత్తిలి రోడ్డుపై నీరు చేరడంతో ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ● **పార్వతీపురం రూరల్:** భారీ వర్షానికి మండలంలోని చెరువులన్నీ ప్రమాదస్థాయికి చేరాయి. రెండు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగితే.. పంటలకు ముప్పు ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. చాకిగెడ్డ ఉప్పొంగితే.. తీవ్ర నష్టాలు తప్పవని ఆవేదన చెందుతున్నారు.

పారాది కాజ్‌వే పై నుంచి ప్రవాహం

బొబ్బిలి రూరల్: పారాది గ్రామంలో వేగావతి నదీ ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. భారీ వర్షాలకు నదిలో అధికంగా నీరు చేరుతోంది. దీంతో కాజ్‌వే పైనుంచి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. నీరు తగ్గాకే మళ్లీ భారీ వాహనాలకు అనుమతిస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.



పారాది వంతెన కాజ్‌వే పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం కారణంగా జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ (08963-293046) ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కొండ శిఖర గ్రామాలు, లోతట్టు ప్రాంతవాసులను అప్రమత్తం చేయాలని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నదులు, వాగులు, వంకలు, చెరువులు, కాజ్‌వేలకు వరద పోటెతుతున్న నేపథ్యంలో వాటిల్లో ఎవరూ దిగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండరాదని , తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అటువంటి ప్రదేశాల్లో పోలీస్, వలంటీర్లు లేదా ఇతరులను ఉంచాలని వెల్లడించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలు, ప్రాజెక్టులను తనిఖీ చేయాలన్నారు. గేట్లు, లాకులు పనిచేసేటట్టు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. ముందస్తు చర్యల్లో భాగంగా తోటపల్లి రిజర్వాయర్, పెద్దగెడ్డ , వెంగళరాయసాగర్ నుంచి దిగువకు వరదనీటిని విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, పాలకొండ సబ్‌కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులున్నారు.

గ్రీవెన్స్ రద్దు.. జాబ్‌మేళా వాయిదా..

భారీ వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను కూడా వాయిదా చేసినట్లు చెప్పారు.



పాలకొండ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు



జలమయమైన గాయత్రీ కాలనీ

ఏకలవ్య విద్యార్థులకు తప్పని అవస్థలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏకు కూత వేటు దూరంలో ఉన్న మల్లి పీవీటీజీ రెసిడెన్షియల్ పాత భవనంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వానలకు తరగతి గదులన్నీ కారిపోతున్నాయి. మరోవైపు వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు వారి గదుల్లో గొడుగులు వేసుకుని బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సి వస్తోంది. వాస్తవానికి భామిని ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. తాత్కాలికంగా కొత్తూరు పోస్టుమెట్రిక్ వసతిగృహంలో కొన్నేళ్లుగా ఆ పాఠశాలను నిర్వహిస్తున్నారు. అయితే వసతి సమస్య నెలకొనడంతో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న 112 మంది విద్యార్థులకు మల్లి పీవీటీజీ రెసిడెన్షియల్ పాత భవనం కేటాయించారు. కొన్నేళ్లుగా అక్కడే వారికి తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా వినాయకచవితి పురస్కరించుకుని 45 మంది ఇళ్లకు వెళ్లారు. మిగిలిన 67 మంది వరకు విద్యార్థులు ఆ భవనంలోనే ఉన్నారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వారి వసతి గది పూర్తిగా కారిపోతోంది. దీంతో విద్యార్థులు అక్కడే గొడుగోలు వేసుకుని ఉండాల్సి వస్తోంది. ఈ విషయమై మల్లి పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవ్‌ను వివరణ కోరగా.. వర్షాల కారణంగా గదులు కారిపోవడం మాట వాస్తవమేనని తెలిపారు. ఆ విద్యార్థులను వేరే గదుల్లోకి పంపించినట్లు చెప్పారు. ఈ విషయమై ఏకలవ్య ప్రిన్సిపాల్ గంగాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉండే గదిలోకి వర్షపు నీరు చేరడంతో మల్లి రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు రిక్వెస్ట్ చేసి.. అక్కడున్న వారికి రెండు గదులు కేటాయించామని వెల్లడించారు.



వసతిగృహంలోని ఓ గదిలో వర్షపునీరు కారుతుండడంతో బకెట్లు పెట్టిన విద్యార్థులు



జైజై గణేశా..

పార్వతీపురం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితిని జిల్లావాసులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ స్వామిని మండపాల్లో కొలువుదీర్చి.. విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. విభిన్న రూపాల్లో ఉన్న వినాయకుడి ప్రతిమలను చూసేందుకు భక్తులు బారులు దీరారు. ముందుగా వినాయక విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి మండపాల్లో కొలువు దీర్చారు. ఉండ్రాళ్లను నైవేద్యంగా పెట్టారు. జై గణేశా.. జైజై గణేశా అంటూ యువకులు, చిన్నారులు సందడి చేశారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో రూపొందించిన వినాయక మండపాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



పాలకొండ: ఏలాంలో భారీ మట్టి వినాయకుని విగ్రహం

గిరిజన ఇంజనీరింగ్ శాఖలో కలకలం

- పనుల రికార్డులను అప్పగించాలని ఆదేశాలు
- సీబీసీఐడీతో విచారణకు రంగం సిద్ధం
- విషయాన్ని గోప్యంగా ఉంచిన ఆ శాఖాధికారులు

పార్వతీపురం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ఇంజనీరింగ్ శాఖలో కలకలం నెలకొంది. పలు పనులకు సంబంధించి రికార్డులు అప్పగించాలని విజిలెన్స్ అధికారులు ఆదేశించడమే ఇందుకు కారణం. మరోవైపు ఆ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు పొందిన కాంట్రాక్టర్ కేసును సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఆ శాఖకు ఆదేశాలు జారీ చేయగా.. ఈ విషయాన్ని గిరిజన ఇంజనీరింగ్ శాఖాధికారులు గోప్యంగా ఉంచారు. మొత్తంగా కొంత మంది కాంట్రాక్టర్లు, వారికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన ఇంజనీరింగ్ అధికారులు, కార్యాలయ సిబ్బందిపైన కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది.

దర్యాప్తునకు ఆదేశం...

గిరిజన ఇంజనీరింగ్ శాఖలో ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు పొందిన కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు సంబంధించి తక్షణమే రికార్డులను అప్పగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ఆదేశాలు వచ్చి.. రోజులు గడుస్తున్నా రికార్డులు ఇంకా అప్పగించలేదు. కొన్ని రికార్డులు చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఉన్నట్టు సమాచారం. ఏదేమైనా దర్యాప్తు వేగవంతానికి ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు.

మరో ముగ్గురిపై చర్యలు..

పార్వతీపురం ఐటీడీఏ గిరిజన ఇంజనీరింగ్‌శాఖలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులను ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వారే కాకుండా కార్యాలయంలో పనిచేస్తున్న ఒక సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇటీవల రిటైర్డ్ అయిన ఓ ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకొనేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. సూపరింటెండెంట్ ఇంజనీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు పొందిన కాంట్రాక్టర్ కేసులో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో పాటు సిబ్బందిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గిరిజన ఇంజనీరింగ్‌శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.



'ఏకలవ్య' పై విజిలెన్స్'

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలకు సంబంధించిన రికార్డులను అప్పగించాలని విజిలెన్స్ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. వాస్తవంగా కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్న తర్వాత సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులు పొందాల్సి ఉంది. కానీ పనులు జరుగుతుండగానే అడ్వాన్స్ రూపంలోని కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్ ఎందుకు తీసుకున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే సకాలంలో బిల్లుల చెల్లింపులు కాకపోవడమే పనులు నిలిచిపోయినట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నప్పటికీ.. ముందస్తుగా ఎందుకు చెల్లించాల్సి వచ్చిందో వారే తేల్చాల్సి ఉంది. ఏదేమైనా గత వైసీపీ సర్కారు హయాంలో అడ్వాన్స్‌లు పొందిన కాంట్రాక్టర్, చెల్లింపులకు సహకరించిన అధికారులకు మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటనేది బహిర్గతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పార్వతీపురంలో గిరిజన ఇంజనీరింగ్ శాఖ కార్యాలయం


ఆదేశాలొచ్చాయి...

గిరిజన ఇంజనీరింగ్ శాఖలో జరిగిన కొన్ని పనులకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు అడిగిన మాట వాస్తవమే. వాటిని పూర్తిస్థాయిలో వారికి అందిస్తాం. సీబీసీఐడీ ద్వారా విచారణ చేయించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి. రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విధుల్లో చేరిన తర్వాత ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం.

- మణిరాజు, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గిరిజన ఇంజనీరింగ్‌శాఖ, పార్వతీపురం

ఆ శాఖలో వారిదే హవా..

గడువులోగా కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించాల్సి బాధ్యత ఇంజనీరింగ్ శాఖపై ఉంటుంది. కానీ ఆ శాఖలో కొంతమంది కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోంది. వారితో కొందరు అధికారులు కూడా కుమ్మక్కైనట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాల విషయానికొస్తే.. రెండేళ్లలో వాటి పనులను పూర్తి చేయించాల్సి ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా.. నిర్మాణాలు పూర్తి చేయించలేకపోవ డంపై కాంట్రాక్టర్ల, ఇంజనీరింగ్ శాఖాధికారుల తీరుపై పలు అను మానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఏళ్లు గడిచినా.. పనులు జరగకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. సకాలంలో భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఇటీవల పాచిపెంట మండలంలో ఇద్దరు ఏకలవ్య ఉద్యోగులు మరణించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా కాంట్రాక్టర్ల మధ్య ఆధిపత్య పోరు కొనసాగు తుంది. ఇద్దరు కాంట్రాక్టర్లకు చెందిన పలు పనులపై ఇప్పుడు దర్యాప్తు జరుగుతుంది. వారి పరస్పర ఫిర్యాదుల వల్లే గిరిజన ఇంజనీరింగ్ శాఖలో జరుగుతున్న అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



2024 మార్చి 21న ఎం.కె.రంజిత్ సిన్హా అండ్ అదర్స్ కేసులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలనుంచి పర్యావరణాన్ని రక్షించుకోవడం 'ప్రాథమిక మానవహక్కు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చొరవ ప్రదర్శించి, క్రియాశీలతతో తీర్పును వెలువరించినట్లుగా పర్యావరణ ప్రేమికులు, మేధావులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమగ్రంగా అధ్యయనం చేద్దాం.

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



న్యాయ వ్యవస్థ క్రియాశీలత

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయసమీక్షాధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అనగా న్యాయవ్యవస్థ తన అధికార విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతుంది. సామాజిక హక్కులను రక్షిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీంకోర్టు, అపెక్స్ జ్యుడీషియల్ బాడీగా దీనికి కేంద్ర బిందువు అయ్యింది.

న్యాయపరమైన కృతశీలత అనేది చట్టాలను చొరవతో, చురుగ్గా వివరించే సందర్భాలను సూచిస్తుంది. న్యాసమీక్ష సాంప్రదాయ సరిహద్దులను దాటి రాజ్యాంగ విలువలను సమర్థించే విషయాల్లో జోక్యం చేసుకుంటుంది.

చేసింది. కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని వెలువరించింది. తరవాత కేసుల్లో కూడా తన తీర్పుల ద్వారా దానిని కొనసాగించింది.

ఎమర్జెన్సీ తరవాత వచ్చిన రాజకీయ-పౌరచైతన్యం వల్ల ప్రజాహిత వ్యాజ్యాలు(పిల్) వాడుకలోకి వచ్చాయి. న్యాయ సహాయాన్ని అందించమని నేరుగా న్యాయవ్యవస్థను కోరేలా ప్రజాహిత వ్యాజ్యాలు ప్రజలను చైతన్య పరిచాయి. శాసన

న్యాయవ్యవస్థ క్రియాశీలత - పరిణామం

గోలక్‌నాథ్ కేసు సుప్రీంకోర్టుకు వచ్చేవరకు ప్రాథమిక హక్కుల సవరణతోపాటు పార్లమెంటు చేసిన చట్టాలన్నింటిపై సుప్రీంకోర్టు ఎలాంటి విభేదాన్ని ప్రకటించలేదు. కానీ 17వ రాజ్యాంగ సవరణ(1964) ద్వారా అప్పుడు ప్రాథమిక హక్కుగా ఉన్న ఆస్తిహక్కును సవరిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. అయితే ప్రాథమికహక్కు అయి న ఆస్తిహక్కును సవరించే అధికారం ప్రకరణ-368 కింద పార్లమెంటుకు లేదని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నుంచే పార్లమెంటుకు న్యాయవ్యవస్థకు మధ్య ఘర్షణ ప్రారంభమైందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ ఘర్షణ పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం

శాఖ, కార్యనిర్వాహక శాఖల బలహీనతే న్యాయశాఖ క్రియాశీలతకు కారణమని రాజ్యాంగవాదుల అభిప్రాయం.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు వాడుకలోకి వచ్చినప్పటి నుంచి పౌరులు, స్వచ్ఛంద సంస్థలు మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని 'ప్రజాహితాన్ని' కాపాడమని అర్థించడం న్యాయ వ్యవస్థకు బలాన్నిచ్చాయి. దాంతో కార్యనిర్వాహఖ శాఖ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం మొదలుపెట్టింది. ఉదాహరణకు కావేరి నదీ జలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు సూచించడం. రోడ్లు, వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వడం, రైళ్ల రాకపోకలకు 'సమయ పాలన' పట్టికలను రూపొందించాలని చెప్పడం, విద్యాసంస్థల్లో అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం. ఈవిధమైన తీర్పులన్నింటినీ పరిశీలిస్తున్న రాజ్యాంగ మేధావులు 'న్యాయ వ్యవస్థతో నడుస్తున్న ప్రభుత్వాలు' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అతిక్రియాశీలతను కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె.మాథుర్, మార్కండేయ కట్జూ 'న్యాయ వ్యవస్థ సహేతుకత'ను ప్రతిపాదించారు. తరచుగా ఈ అతి క్రియాశీలతను వినియోగించడం ఆరోగ్యకరమైన సంకేతం కాదని న్యాయమూర్తి హెచ్.ఆర్.ఖన్నా అభిప్రాయపడ్డారు.

దిక్సూచి DIKSUCHI

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడం వల్ల ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపర్చని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ప్రజాప్రయోజనాల వ్యాజ్యంతో మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశం లభించింది. దాంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చాయి.
- న్యాయస్థానాలు స్వయంప్రేరిత కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీచేయడం.(ఉదాహరణకు కోర్టుకు వచ్చిన ఉత్తరాల ద్వారా, పేపర్లలో వచ్చిన వార్తల ఆధారంగా తనంత తానుగా ఆ సంఘటనలను విచారణకు స్వీకరించడం).
- దత్త శాసనాధికారాల వల్ల కార్యనిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై అధికార దుర్వినియోగం, జవాబుదారీతనం లోపించడం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

న్యాయశాఖ క్రియాశీలత - ముఖ్య వివాదాలు

- ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాల కార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- లక్ష్మీకాంత్, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్నపిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలు ష్యం, తద్వారా తాజ్ మహల్‌కు ఉన్న ముప్పుపై కేసులు.
- బిహార్ ఖైదీల కేసు; బిహార్ పశుగ్రాసం కేసు.
- జార్ఖండ్ ముక్తిమోర్చా అవినీతి వివాదం.
- రక్షణశాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- జడ్జిల నియామకం.
- కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై కేసు(1994)లో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం.
- సతీష్‌శర్మ - పెట్రోల్ బంకుల కేటాయింపుల దుర్వినియోగం.
- గంగానది కాలుష్య నివారణ.
- వాహన కాలుష్యం వల్ల ఢిల్లీవాసుల జీవించేహక్కుకు భంగం కలిగిందంటూ ఒక పౌరుడు వేసిన కేసులో డీజిల్ బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చాలని ఆదేశించడం.
- అడవుల్లో చెట్లను విచక్షణారహితంగా నరికివేయడానికి సంబంధించి.
- కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.
- ఢిల్లీలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.

గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)లో మహారాష్ట్ర హైకోర్టు తీర్పు చెబుతూ న్యాయస్థానాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొంది. ఆదే విధంగా పీయూడీఆర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)ను కూడా ఇక్కడ పేర్కొనవచ్చు. 9వ ఆసియా క్రీడల కోసం చేపట్టిన నిర్మాణాల్లో పాల్గొనడానికి వచ్చిన వారి శ్రమను యాజమాన్యం దోచుకుంటోందని ఒక స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించి కార్మికులకు పని గంటలను నిర్ధారించింది.

1998 ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం.కె.బెజ్ బారువాను ఆ శాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేశారు. ఈ బదిలీ సహజంగా జరిగింది కాదని, ఉద్దేశపూర్వకంగా చేశారని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు బెజ్ బారువా బదిలీ విషయంలో కేంద్రప్రభుత్వ చర్యను తప్పుపట్టింది.

- ఐ.ఆర్.కొయల్హొ కేసు(2007)లో 9వ షెడ్యూల్‌లోని అంశాలను కూడా న్యాయసమీక్ష చేయవచ్చని తీర్పుచెప్పడం.
- శ్రేయోసింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఏను కొట్టివేయడం(2015).
- ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకాలకు సంబంధించి కొలీజియం వ్యవస్థను పునరుద్ధరించడం(2015)
- రామ్‌సింగ్ కేసు(2015)లో వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జాట్‌లను ఓబీసీల్లో చేర్చడాన్ని కొట్టివేయడం.

లెటర్ రిపీటెడ్ సిరీస్

● రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

లెటర్ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నల్లో కొన్ని అక్షరాల సమూహాలను ఒక సిరీస్‌గా పేర్కొంటారు. ఈ అక్షర సమూహాలు రకరకాలుగా ఉంటాయి. అనగా 3, 4, 5 లేదా 6 అక్షరాలు గల సమూహాలు రిపీటెడ్‌గా రావడం.

ఉదా: dabc/dabc/dabc/dabc. లేదా

ఒక క్రమపద్ధతిలో అక్షర సమూహాలు విభజించడం.

ఉదా: ab/aabb/aaabbb/aaaabbbb.

గమనించండి: మొదటి సమూహంలో ఒక ab, రెండో సమూహంలో రెండు aలు, రెండు bలు, మూడో సమూహంలో మూడు aలు, మూడు b లు ఇలా ఒక క్రమపద్ధతిని అనుసరించి సిరీస్ ఏర్పడుతుంది. లేదా ఒక్కోసారి చెయిన్ పద్ధతిలో అక్షర సమూహాలు ఉంటాయి.

ఉదా: abc/bca/cab/abc.

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివర ఉన్నది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిలో ఈ సిరీస్ ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు ఉండే పద్ధతి

కొన్ని అక్షరాల సమూహాన్ని ఒక సిరీస్‌గా పేర్కొంటారని పైన చెప్పుకున్నాం. ఈ అక్షరాల మధ్య మధ్య కొన్ని అక్షరాలను వదిలేస్తారు. ఆ సిరీస్‌లో వదిలేసిన అక్షరాల సమూహం ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఉంటుంది. కాబట్టి ప్రశ్నగా ఇచ్చిన సిరీస్ ఏ క్రమపద్ధతిని అనుసరిస్తున్నదో తెలుసుకోవాలంటే ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో గల అక్షరాలను ప్రశ్నలోని ఖాళీల్లో పూరించి సిరీస్‌ని అవగాహన చేసుకోవాలి. సమాధానాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఏ ఆప్షన్‌లోని అక్షరాలను ఖాళీల్లో పూరించిన ఆ సిరీస్ క్రమపద్ధతిని అనుసరిస్తుందో ఆ ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాలి.

ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నలలో అభ్యర్థి ముందుగా ఆ సిరీస్‌లో ఉపయోగించిన అక్షరాలు గమనించాలి. మూడు అక్షరాలు ఉపయోగిస్తే మూడు అక్షరాల సమూహంగా నాలుగు అక్షరాలు ఉపయోగిస్తే నాలుగు అక్షరాల సమూహంగా విభజించే అవకాశం ఉంది. అలా కాని పక్షంలో

1. సిరీస్‌లో మొత్తం 12 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 4గా విభజించే అవకాశం ఎక్కువ.
2. సిరీస్‌లో మొత్తం 16 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4గా విభజించే అవకాశం ఎక్కువ.
3. సిరీస్‌లో మొత్తం 15 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 5గా విభజించే అవకాశం ఎక్కువ
4. సిరీస్‌లో మొత్తం 20 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4 లేదా 5 విభజించే అవకాశం ఎక్కువ
5. సిరీస్‌లో మొత్తం 14 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 2/3/4/5 గా విభజించవచ్చు.

ఉదా: PQ/PQQ/PQQQ/PQQQQ

ప్రతి సమూహంలో 'Q' ఒక్కొక్కటి పెరిగింది.

6. సిరీస్‌లో 18 ఉంటే(అక్షరాలు, ఖాళీలు కలిసి) 3 లేదా 4 లేదా 6గా విభజించే అవకాశం ఎక్కువ ఒక్కోసారి 3/4/5/6గా కూడా ఉండే అవకాశం ఉంటుంది.

ఉదా: abc/aabc/aabbc/aabbcc.

మొదటి సమూహం నుంచి రెండో సమూహానికి a పెరిగింది. రెండో సమూహం నుంచి మూడో సమూహానికి b పెరిగింది. మూడో సమూహం నుంచి 4వ సమూహానికి c పెరిగింది. ఈ లెటర్ సిరీస్‌కు సంబంధించి ప్రశ్నలు ఏవిధంగా ఉంటాయో, గత వివిధ పోటీ పరీక్షలలో ఇస్తున్న, ముఖ్యమైన సిరీస్ పద్ధతులను అభ్యర్థులకు ఈ చాప్టర్‌పై అవగాహన కలిగించేందుకు దిగువ ఇస్తున్నాం. దిగువ ఇచ్చిన సిరీస్ పద్ధతులను అభ్యర్థులు కనీసం ఐదు లేదా ఆరుసార్లు చదివి జాగ్రత్తగా పరిశీలించి సిరీస్‌లో అక్షరాల విభజన, సిరీస్‌లు ఏర్పడే విధానం, వాటి స్వభావంపై అవగాహన ఏర్పరచుకొని ఈ చాప్టర్‌పై పట్టుసాధించగలరని ఆశిస్తున్నాం.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ఉండే అక్షరాలు P, Q, R, S లేదా a,b,c,d లేదా K,L,M,N అయి ఉంటాయి.

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు

1. ab/ab/ab/ab/ab/ab
   రెండేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
2. PQR/PQR/PQR/PQR
   మూడేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
3. dcab/dcab/dcab/dcab
   నాలుగేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
4. adcbc/adcbc/adcbc
   ఐదేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
5. dacbad/dacbad/dacbad
   ఆరేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
6. abba/baab/abba/baab
   మొదటి సమూహంలో గల అక్షరాలు abba. ఈ సమూహంలో చివరి రెండు అక్షరాలు(ba) రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు(ab) రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి.
   రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు (ab) మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు (ba) మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.
7. PQ/PPQQ/PPPQQQ/PPPPQQQQ
   మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఆరు అక్షరాలు, నాలుగో సమూహంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలో ఒక PQ, రెండో సమూహంలో రెండు Pలు, రెండు Qలు, మూడో సమూహంలో మూడు Pలు, మూడు Qలు ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
8. abc/aabc/aabbc/aabbcc
   మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఐదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

వరదపై ఆగని జగన్ బురద

- వలంటీర్లు ఉంటే సమర్థంగా ఎదుర్కొనేవారట!
- ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్.. విరుచుకుపడ్డ నెటిజన్లు
- జగన్ నిర్వాకమే ఈ వరద అంటూ మండిపాటు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ వరదపై తన బురద రాజకీయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వలంటీర్లు ఉంటే, ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేవారంటూ మరోసారి విషం కక్కారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా... లక్షల మంది ఉద్యోగులున్న ప్రభుత్వ యంత్రాంగం ఏమైపోయిందంటూ ఆదివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వం మారకపోతే, వైసీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. నిజానికి, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిననేతగా, భుజం భుజం కలిపి, వరద బాధితులకు సాయమందించాల్సిన తరుణమిది. అది వదిలేసి జగన్ ట్వీట్ చేసిన బురద రాజకీయ వ్యాఖ్యల పట్ల జల వనరుల నిపుణుల నుంచి ప్రభుత్వ అధికారులు, బాధితులు, నెటిజన్లు వరకు.. సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మీ నిర్వాకమే..రాజకీయాలకు ఇదా సమయం అంటూ అత్యధిక నెటిజన్లు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో విమర్శలు మాని ఆకలి కేకలు పెడుతున్న బాధితులకు సాయం చేయాలంటూ ఘాటుగా సూచించారు.

వైసీపీ ఎత్తులు చిత్తు

వరద బాధితులకు పరామర్శ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించిన జగన్ ప్రయత్నాన్ని ఇటీవల వరదప్రాంతాల్లో మహిళలే వమ్ము చేశారు. తమకు ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సాయమందుతోందంటూ స్పష్టంచేశారు. ఏమీరెంత సాయం అందిస్తున్నారంటూ పరామర్శకు వచ్చిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మహిళలు నిలదీశారు. దీంతో, బయటకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ .. ఎక్స్ వేదికగా మాత్రం బురద రాజకీయాలకు తెరతీశారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కించపరిచేలా ఉన్న జగన్ వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వినాయక చవితి సెలవు దినం కూడా ఉద్యోగులు పనిచేసిన విషయం వారు గుర్తుచేశారు.

బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్...

జగన్ ట్వీట్‌కు సినీనటుడు బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్ చేశారు. ..మీరు కరెక్టు సార్. వాళ్లు చెయ్యలేరు సార్. ఇకనుంచి మనం చేద్దాంసార్. ఫస్ట్ మనం రూ.1000 కోట్లు రిలీజ్ చేద్దాం సర్. మన వైసీపీ కేడర్ మొత్తాన్ని రంగంలోకి దింపుదాం. మనకు జనాలు ముఖ్యం సార్. గవర్నమెంటు కాదు సార్. మనం చేసి చూపిద్దాం సార్.. జై జగన్ అన్నారు అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ట్వీట్ తాను చేయలేదని, తన ఖాతా హ్యాక్ అయిందని, ఫిర్యాదు కూడా చేశానని బ్రహ్మాజీ వివరణ ఇచ్చారు.

దుష్ప్రచారాన్ని సహించొద్దు..

- సోషల్ మీడియాలో పోస్టులపై ప్రభుత్వం సీరియస్
- మితిమీరితే ఊరుకోబోనని ముఖ్యమంత్రి హెచ్చరిక

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరద సహాయ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆ పోస్టులు పెడుతున్నవారెవరో ఆరా తీయాలని నిర్ణయించింది. మితిమీరితే శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. తాజాగా వరద సాయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై అనుమానాలు రేకెత్తించేలా సోషల్ మీడియాలో పోస్టులు మొదలయ్యాయి. ఇంతవరకూ కేంద్రం సాయం ప్రకటించకపోవడంపై చంద్రబాబు ప్రభుత్వం అసహనంగా ఉందని... దీంతో ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయని ఈ పోస్టుల్లో పేర్కొంటున్నారు. కొద్ది రోజుల్లో కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ బయటకు వచ్చేసి, ఎన్డీయే కూటమికి గుడ్ బై చెబుతుందనే ప్రచారం చేస్తున్నారు. కేంద్ర సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల క్రితమే స్పష్టత ఇచ్చారు. తాము నష్టానికి సంబంధించి ప్రాథమిక నివేదిక పంపకుండానే కేంద్రం సాయం ప్రకటించడం సాధ్యం కాదని, తాము ఇంకా నివేదిక పంపలేదని చెప్పారు. ఎవరీ అతిగా ప్రవర్తిస్తున్నారు. వైసీపీ నుంచే ఇటువంటి దుష్ప్రచారం నడుస్తోంది. మరీ మితిమీరిపోతే మేం సీరియస్‌గా తీసుకుంటాం. దానికి తగిన శిక్ష ఉంటుందీ అని హెచ్చరించారు.

బెజవాడ అనుభవంతో భద్రం!

- భారీ వర్షాలతో ఉత్తరాంధ్రకు వరద ముప్పు
- ప్రాణ, ఆస్తి, పంట నష్టం తగ్గించాలి
- ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజీలు
- ఆహార సరఫరాకు డ్రోన్లు వాడండి
- ఏలేరు ప్రాజెక్టు వద్ద గట్టి చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ వరదను గమనంలో ఉంచుకుని ముందస్తు చర్యలను వేగంగా తీసుకోవాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలని కోరారు. ఆదివారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరదల ప్రభావం కనిపిస్తోంది. అన్ని జిల్లాల కలెక్టర్లు కూడా అప్రమత్తం కావాలి. నాగావళి, వంశధార నదులకు వరద పెరిగే అవకాశం ఉంది. ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద నీరు రావొచ్చు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో బ్యాలెన్స్ చేసుకుని, సమర్థవంతంగా వ్యవహరించాలి. కాలువలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలి. భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగు నీరు, ఆహారం, మెడికల్ క్యాంప్‌లను సిద్ధం చేయాలి. ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలి. ముందస్తు చర్యలతో ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. పంట నష్టం అంచనా, బాధితులకు ఆహార సరఫరా, వరద పరిస్థితులను గమనించేందుకు డ్రోన్లు వినియోగించాలి. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలి. పరిస్థితి తీవ్రతను బట్టి, సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీమ్‌ను సంప్రదించాలి. ఏజెన్సీలో వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. వినాయకుని నిమజ్జనం కోసం చెరువులు, కాలువల వద్దకు వెళ్లే భక్తులు, ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలవారీగా వర్షపాతం వివరాలను సీఎంకు కలెక్టర్లు వివరించారు. బాపట్ల జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో పెరుగుతున్న బాధితులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు పెంచుతున్నామని ఆ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రెండువేల మందికి పైగా ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం అందిస్తున్నామని ఏలూరు కలెక్టర్ కె. వెట్రి సెల్వీ చెప్పారు. విజయనగరంజిల్లాలో భారీ వర్షాలకు అనుగుణంగా రాకపోకలను నియంత్రిస్తున్నామని కలెక్టర్ అంబేడ్కర్ వివరించారు.



వరద పరిస్థితిని గవర్నర్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు

పండుగ రోజూ పరామర్శలే

ముఖ్యమంత్రి చంద్రబాబు వినాయకచవితి పండగ రోజు కూడా వరద బాధితులను పరామర్శించేందుకు విజయవాడలో పర్యటించారు. సింగ్‌నగర్‌లో వరదనీరు ఉండటంతో పొక్లెయిన్ ఎక్కి మారుమూల ముంపు ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఓవైపు వర్షం.. మరోవైపు వరద నీటిలోనే సుమారు మూడు గంటలపాటు సీఎం పర్యటన కొనసాగింది. బాధితులు తమ కష్టాలను ఆయనకు చెప్పుకొన్నారు. తీవ్రంగా నష్టపోయామని, ఇంట్లో ఉన్న వస్తువులు, వాహనాలు అన్నీ దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గండ్లు పూడ్చివేయడంతో వరద నీరు ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుందని, ప్రతి ఒక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని చంద్రబాబు...బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం కాన్వాయ్‌లో తిరిగి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

గవర్నర్‌ను కలిసిన చంద్రబాబు

- ప్రభుత్వ కృషిని ప్రశంసించిన అబ్దుల్ నజీర్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఇక్కడ కలిశారు. విజయవాడలోని రాజ్ భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌తో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడంతో ఆయన గవర్నర్‌ను కలసి ఈ పరిణామాలను వివరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరదల వల్ల జరిగిన నష్టం, బాధితులను ఆదుకోవడానికి తాము తీసుకొన్న చర్యలను చెప్పారు. ప్రభుత్వం సత్వరం స్పందించి యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకోవడానికి తీసుకొన్న చర్యలను గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడాన్ని మెచ్చుకొన్నారు. త్వరలోనే ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

నేటి నుంచి నష్టం అంచనా

- 2.32 లక్షల నివాసాల్లో సర్వే
- వ్యాపార సంస్థల నష్టం కూడా
- కుటుంబ సభ్యులెవరున్నా నమోదు
- ధ్రువీకరణ కోసం ఆధార్ తప్పనిసరి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి

విజయవాడ/అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. 2.32 లక్షల గృహాలతోపాటు వాణిజ్య, వ్యాపార సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నారు. దీనికిగాను రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో 17 వేల బృందాలను ఏర్పాటు చేశారు. నష్టం అంచనా నమోదుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ బృందాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా నేతృత్వంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మీడియాతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో బృందానికీ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. వారితోపాటు వార్డు సెక్రటరీ, వలంటీర్, పోలీసు సిబ్బంది ఒకరు ఉంటారన్నారు. మూడు రోజుల్లో నష్టాన్ని నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారితోపాటు జిల్లా అధికారి ఒకరు పనిచేస్తారని తెలిపారు.

అందుబాటులో ఉండాలి!

ఎన్యూమరేషన్ బృందాలు వచ్చిన సమయంలో గృహ, వ్యాపార సంస్థల యజమానులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సృజన కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తే ఎన్యూమరేషన్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఏదైనా కారణం వల్ల ఇంట్లో ఎవరూ లేకుంటే వార్డు సెక్రటరీకి సమాచారం ఇస్తే మరోసారి ఇంటికి వచ్చి ఎన్యూమరేషన్ చేస్తారని వివరించారు.

ఇళ్లే మొదట

తొలుత గృహాల్లో నష్టం అంచనాకు ప్రాధాన్యం ఇస్తారని కలెక్టర్ చెప్పారు. ఆ తర్వాత ఆటోలు, రిక్షాలు, తోపుడు బండ్లు తదితరాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాగా, విద్యార్థులతో కూడిన మరికొన్ని బృందాలు సమాంతర సర్వే నిర్వహించనున్నాయి.

వరద నష్టం 6,882 కోట్లు

- కేంద్రానికి రాష్ట్రం ప్రాథమిక నివేదిక

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రూ.6,882 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి శనివారం ప్రాథమిక నివేదికను పంపింది. రోడ్లు భవనాల శాఖకు రూ.2,165 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. జలవనరుల శాఖకు 1,569 కోట్లు, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు 1,160 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.12 కోట్లు, వ్యవసాయ శాఖకు 301 కోట్లు, మత్స్య శాఖకు 158 కోట్లు, ఉద్యానవన శాఖకు 40 కోట్లు, విద్యుత్ శాఖకు 481 కోట్లు గ్రామీణ నీటి పారుదల శాఖకు 76 కోట్లు, పంచాయితీరాజ్ పరిధిలోని రోడ్లకు 168 కోట్లు, అగ్నిమాపక శాఖకు 2 కోట్ల నష్టం జరిగినట్టు వివరించింది.

వాహనాల రిపేర్ ఖర్చు

కొంత భరిస్తాం

- ఇళ్లలో పాడైన పరికరాలకూ మరమ్మతులు
- తక్కువ ఖర్చైతే మేమే పెట్టుకొంటాం
- కంపెనీలు, బ్యాంకర్లతో చర్చలు
- ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత
- రోడ్ల శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల్లో మునిగిపోయి దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లలో పరికరాల రిపేర్ల ఖర్చులో కొంత ప్రభుత్వం భరించడంపై ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "వరదల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు పెద్ద సంఖ్యలో మునిగిపోయి దెబ్బ తిన్నాయి. వీటిలో కొన్నింటికి బీమా ఉంది. కొన్నింటికి లేదు. ఆథరైజ్డ్ మెకానిక్కుల వద్ద రిపేర్ చేయిస్తేనే బీమా వస్తుంది. కొందరు యజమానులు తమకు నమ్మకం ఉన్నవారి వద్ద రిపేర్ చేయించుకోవాలని అనుకొంటారు. బీమా లేని వాహనాల రిపేర్లు ఎలాగో ఆలోచించాలి. వాహనాల కంపెనీలతో ఈ విషయం మాట్లాడుతున్నాం. కంపెనీల వద్ద సీఎస్ఆర్ నిధులు ఉంటాయి. వాటి కింద ఉచితంగా రిపేర్లు చేయాలని అడుగుతున్నాం. తక్కువ ఖర్చయితే ప్రభుత్వం తరఫున మేం పెట్టుకొంటాం. మరీ ఎక్కువైతే కొంత ప్రభుత్వం...కొంత యజమానులు భరించేలా ఆలోచన చేస్తున్నాం. వరద ప్రాంతాల్లోని ఇళ్లలో రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు పాడై పోయాయి. వాటిని ఆయా కంపెనీల తయారీదారులే మరమ్మతు చేయాలి. విడి భాగాలు వాళ్ల వద్దే ఉంటాయి. ఆ కంపెనీలతో కూడా మాట్లాడి తక్కువ ఖర్చుతో రిపేర్లు అయ్యే మార్గం అన్వేషిస్తున్నాం. ఇందులో కూడా వీలైతే కొంత ఖర్చు ప్రభుత్వం పెట్టుకొంటుంది. గ్యాస్ స్టవ్‌లు కూడా వాటిని కొన్న కంపెనీలే రిపేర్ చేయాలి. వాళ్లతో కూడా మాట్లాడుతున్నాం. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్ వంటి పనులు అర్బన్ కంపెనీకి అప్పగిస్తున్నాం. ఆ కంపెనీకి ఇందులో ప్రావీణ్యం ఉంది. ఇతరత్రా ఎవరైనా ఈ పనులు చేసే వాళ్లు ఉంటే వాళ్లను కూడా ఈ కంపెనీకే అప్పగిస్తున్నాం. రేట్లు తక్కువలో ఉండేలా చూస్తాం. ఇవన్నీ ఒకటి రెండు రోజుల్లో తేలతాయి. వీటన్నింటిపైనా వివరంగా ఒక కరపత్రం తయారు చేసి ఇంటింటికీ పంపిస్తాం" అని ఆయన వివరించారు. చిన్న వ్యాపారాలు చేసుకొనేవారు, షాపులు నిర్వహించేవారు, పెద్ద వ్యాపారాలు చేసేవారు అందరూ నష్టపోయారని, వాళ్లను తిరిగి ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని, కేంద్రం సహాయం కూడా కోరుతున్నామని ఆయన వివరించారు.

శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ

వరద తగ్గిన తర్వాత ముంపు ప్రాంతాల్లో రోడ్లు, కాల్వలు శుభ్రం చేయిస్తున్నామని, ఎలా శుభ్రం చేశారో డ్రోన్లతో తనిఖీ చేయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లు తీసిన వీడియోలు, ఫొటోలను క్షేత్రస్థాయిలో పని చేయించేవారికి పంపి ఎక్కడైనా సరిగ్గా చేయకపోతే మళ్లీ చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు డ్రెయిన్లు శుభ్రం చేయలేదని, వరద కాల్వల పనులు నిలిపివేసిందని ఆయన విమర్శించారు. విజయవాడలో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'బుడమేరు కింద ఆక్రమణలు తొలగిస్తాం. ఈ నీరు సముద్రం చేరేవరకూ ఆటంకాలు లేకుండా అన్నీ తొలగిస్తాం. మళ్లీ విజయవాడకు వరద రాకుండా చేస్తాం' అన్నారు. ఈ 8 రోజుల్లో మొత్తం 97 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేశామన్నారు.

ఎడతెరిపి లేని వాన

● రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలు
● జనజీవనం అస్తవ్యస్తం.. ఎక్కడికక్కడే నిలిచిన నీరు


దత్తిరాజేరు: రోడ్డుపై వరద ప్రవాహం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. శని, ఆదివారాల వర్షాల వల్ల నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. చెరువులు నిండి గండ్లు పడే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల రహదారులకు గండ్లు పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు మరమ్మతు చర్యలు చేపడుతున్నారు.


రాజాం: గెడ్డవలస వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

కొత్తవలస: భారీ వర్షాలు కారణంగా కొత్తవలస జంక్షన్‌తో పాటు కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సులోకి నిరు చేరింది. కొత్తవలస జంక్షన్ లో నున్న అండర్ బ్రిడ్జి నిండిపోతుండడంతో రైల్వేశాఖ మోటార్‌లతో నీటిని ఎప్పటికప్పుడు తోడిస్తున్నారు. కొత్తవలస మధ్యలో నున్న వీరసాగరం చెరువును విజయనగరం ఆర్డీవో ఎం.వీ.సూర్యకళ ఆదివారం తహసీల్దార్ నీలకంఠరావుతో కలసి పర్యవేక్షించారు. వేపాడ మండలంలోని శనివారం రాత్రి నుండి వర్షాలు కురుస్తున్నాయి.

● **రాజాం:** రాజాం పట్టణంలో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పట్టణంలో రోడ్లన్నీ జయలమయయయ్యాయి. ప్రధాన రహదారులు చెరువుల్లా తలపిస్తు దర్శనమిచ్చాయి. కాంప్లెక్స్‌లోకి వెళ్లే ముందు పెద్దగొయ్యి ఏర్పడటంతో బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ● **రాజాం రూరల్:** రాజాం మండలంలోని సారధిగెడ్డ, సింహాద్రి గెడ్డలు పరవళ్లు తొక్కాయి. చెరువులు, పొలాల్లో భారీగా నీరు చేరింది. మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మురుగునీటి కాల్వలు పొంగి శ్రీకాకుళం రోడ్‌లోని సప్తగిరి కాలనీలోని ఇళ్లల్లోకి మురుగునీరు చేరింది. ● **రామభద్రపురం:** మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏడొంపులగెడ్డ పొంగిపొర్లడంతో కొత్తరేగ, పాతరేగ గ్రామాలప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండలమీద కొద్దిపాటి వర్షం కురిసినా ఈ గెడ్డనుంచి భారీ ప్రవాహంతో నీరు రావడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపో తున్నాయి. ● **తెర్లాం:** మండల కేంద్రం తెర్లాం సమీపంలోని మంగళిగెడ్డ ఉధృ తంగా ప్రవహిస్తోంది. ఫలితంగా తెర్లాం-బొబ్బిలి మార్గంలో రాకపోకలకు తీవ్ర అంత రాయం కలుగుతోంది. తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఆర్ డబ్ల్యుఎస్ జేఈ హరి, సర్పంచులు లవణ్‌కుమార్, రూప, ఎంపీటీసీ ఆనంద్ తది తరులు పర్యవేక్షించారు. ● **నెల్లిమర్ల:** నెల్లిమర్ల మండలంలో చంపావతి నదిలో ప్రవాహం పెరిగింది. ఎగువన ఉన్న గుర్ల గెడ్డ, గడిగెడ్డ, ఊటగెడ్డలోని నీరు కూడా నదిలో చేరడంతో ఆదివారం మధ్యాహ్నం నాటికి ఉధృతి పెరిగింది. నదిలో ఎవరూ దిగవద్దని తహసీల్దార్ సుదర్శనరావు, నగర పంచాయతీ కమిషనర్ విశ్వేశ్వరరావు సూచించారు. ● **రేగిడి:** రేగిడి మండలంలో వాగులు, గెడ్డలు ఉధృతమయ్యాయి. ఆకులోవకట్టగెడ్డ, సాయన్నగెడ్డలు పొంగడంతో మండలంలోని లోతట్టు గ్రామాలకు వరద భయం వెంటాడుతోంది. శనివారం రాత్రి మడ్డువలస 8 గేట్లు విడిచిపెట్టడం, మరోవైపు తోటపల్లి బ్యారేజ్ నీరు కలవడంతో నాగావళిలో 18 వేల క్యుసెక్కుల వరకు నీటిప్రవాహం ఉంది. 145 ఎకరాలు నీటిమునిగినట్లు వ్యవసాయశాఖ గుర్తించినట్లు ఏవో మురళీ క్రిష్ణ తెలిపారు. రేగిడిలో ప్రభుత్వ కార్యాలయాలు కూడా జలదిగ్బంధంలో ఉన్నాయి.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కాల్ సెంటర్

విజయనగరం రింగురోడ్డు: తుఫాన్ వల్ల జిల్లా వ్యాప్తంగా ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు సహాయక చర్యల కోసం నగరపాలక సంస్థ అధికారులు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 98499 06486 నెంబరుకు ఫోన్ చేసి ఇబ్బందులు, నష్టాలు కలిగినా తెలపాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసిన ఎంపీ కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కార్యాలయంలో 24/7 పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాలకు ఇబ్బందులు పడేవారు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారు కంట్రోల్ రూమ్‌లోని ఫోన్ నెంబర్లుకు ఫోన్ చేస్తే రెవిన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ, తదితర అధికారులకు తెలియచేసి సహాయచర్యలు చేపడతామని ఎంపీ కలిశెట్టి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సంప్రదించాల్సి ఫోన్ నెంబర్లు ఇవీ..

● 89190 60911 ● 86393 20927
● 70275 54609 ● 79896 98689


వీరసాగరం చెరువు గట్టు పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యకళ


రాజాం రూరల్: మునిగిపోయిన మొక్కజొన్న పంట


నెల్లిమర్ల: చంపావతి నదిలో పెరిగిన ప్రవాహం


డెంకాడ: గుణుపూరులో అయ్యచెరువుకు గండిపడిన దృశ్యం


పూసపాటిరేగ: ఎరుకొండ రహదారిపై లోతట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు


తెర్లాం: తెర్లాం-బొబ్బిలిరోడ్‌లో నీటి ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు


లక్కవరపుకోట: గొల్జాం మార్గంలో కూలిన చెట్టును తొలగిస్తున్న రైతులు


దత్తి ఎస్సీ కాలనీ పాఠశాలలోకి వరదనీరు


చీపురుపల్లి: కూలిపోయిన నాగంపేట పాఠశాల ప్రహరీ


జలదిగ్బంధంలో రేగిడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

ఇసుక విక్రయాలు వేగవంతం

భామిని: వంశధార వరద కాలువ కాట్రగడలో మేట వేసిన ఇసుకను వేగవంతంగా తొలగించి విక్రయాలకు చర్యలు తీసుకోవాలని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కాట్రగడ వరదకాలువ వద్ద మేటలు, నేరడి స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ర్యాంప్‌లో ఉన్న వంద మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. విక్రయాల్లో జాప్యం తగదన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంతో వెలుగు

రాజాం: మరణానంతరం నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పెంకి గౌరీశ్వరరావు, అర్నిపల్లి వెంకటనాయుడు అన్నారు. జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కల్యాణ్ మగటపల్లి నేత్ర సేకరణ కేంద్రం ప్రోత్సాహంతో ఆదివారం ఏఎంసీ సేవా ఫౌండేషన్ వారు నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాబ్జీ, లెంక శ్రీహరి, పెంకి చైతన్యకుమార్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఎంఆర్ ఫార్మసీ కాలేజీలో జాబ్‌మేళా

విజయనగరం టౌన్: ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని మహరాజా కాలేజ్ ఆఫ్ ఫార్మశీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఉదయ్‌శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన ఫైజర్ ఫార్మా హెల్త్ కేర్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు హాజరై, ఇంటర్వూలు నిర్వహించి ఉద్యోగ ఎంపికలు చేపడతారన్నారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాకు 2023, 2024 ఏడాదిలో డి.ఫార్మశి పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాడంగి: భారీ వర్షాల కారణంగా నదులలో ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమామహేశ్వరరావు తెలిపారు. నదీ ప్రవాహంతో నీరు రంగుమారి కలుషితం అవుతున్నందున ప్రజలు కాచిచల్లార్చి వడపోసి నీటిని తాగాలన్నారు. పంపుహౌస్ చుట్టూ నీటిప్రవాహం ఎక్కువవుతోందని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్త వహించాలని కోరారు.

వరద బాధితులకు విరాళాలు


ఎమ్మెల్యేకి విరాళం అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: వరదలతో పెనునష్టం సంభవించిన నేపథ్యంలో పలువురు మానవతావాదులు తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. పట్టణానికి చెందిన అర్బన్ బ్యాంకు రిటైర్డ్ అధికారి ఐవీ రాజేశ్వరరావు లక్ష రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే బేబీనాయనకు ఆదివారం అందజేశారు. బొబ్బిలి కోటకు విచ్చేసి బేబీనాయనకు చెక్కును అందజేశారు. బాడంగి మండలం పి.వెంకంపేటయువత రూ. 52 వేలు విరాళాన్ని బేబీనాయనకు అందజేశారు. పట్టణానికి చెందిన సత్యసాయి ధ్యాన మండలి యోగా గురువులు వెంకటరాజు, త్రినాథస్వామి, మురళి ఆధ్వర్యంలో రూ.10,116 రూపాయలను విరాళంగా చెక్కును ఎమ్మెల్యే బేబీనాయనకు అందజేశారు.

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని నరసింహనాయుడు కాలనీకి చెందిన చిన్నారులు ఆదివారం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను తాము కిడ్డీ బ్యాంకులో దాచుకున్న నగదు తాము చదువుతున్న పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వరద సహాయ నిధికి విరాళాలు ఇవ్వండి


మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో వరద బీభత్స బాధితుల కోసం లోక్‌సత్తా పార్టీ తరఫున ప్రత్యేక ఖాతా లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టరు జయప్రకాష్ నారాయణ ఏర్పాటు చేశారని, ఆ నిధికి విరాళాలు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబీభీశెట్టి బాబ్జీ కోరారు. ఆదివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు తీవ్ర నష్టం కలిగించాయని, ప్రభుత్వ యంత్రాంగం ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తున్నా, పౌర సమాజంగా మనందరం ఉదారంగా సహాయం అందించేందుకు ముందుకు రావాలన్నారు. లోక్‌సత్తా పార్టీ తమ వంతు ప్రయత్నం చేస్తున్నదని, ఆ ప్రయత్నంతో ప్రముఖులు, ప్రజలు, పారిశ్రామిక వేత్తలు కలిసి రావాలని కోరుతూ వివరాలు విడుదల చేశామన్నారు. విరాళాల స్క్రీన్ షాట్‌ని 98660 74025 నెంబరు పంపాలన్నారు. దాతలకు మూడు ధృవీకరణ పత్రాలు అందుతాయన్నారు. ఒకటి జేపీ సంతకం ఉన్న ధ్రువీకరణ, ఇచ్చిన విరాళానికి సంబంధించి రసీదు, వందశాతం పన్ను మినహాయింపు సర్టిఫికెట్ పొందుతారని తెలిపారు. పార్టీ నాయకులు నాగభూషణం, రామచంద్రరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ రద్దు

విజయనగరం క్రైం: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం రద్దు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు పోలీసు కార్యాలయానికి రావొద్దని సూచించారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

విజయనగరం దాసన్నపేట: నగరంలోని రామకృష్ణానగర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులపై ఇళ్లు కూలిపోయిందని, దీంతో గాయాల పాలైన బలగా లింగమూర్తిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నేత రెడ్డి శంకరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లింగమూర్తి నడుంపై రాట కూలిందని, అలాగే తలకు దెబ్బ తగిలిందని దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించాలన్నారు. కాలనీ కార్యదర్శి శాంతమూర్తి తదితరులున్నారు.

ఆ సందేశాలపై ఆందోళన వద్దు

కలెక్టరేట్: జిల్లాలో వరద పరిస్థితిపై వాట్సాప్ గ్రూపుల్లో చలామణి అయ్యే ఫేక్ సమాచారాన్ని నమ్మవద్దని కలెక్టరు అంబేడ్కర్ సూచించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పరిస్థితిని గమనిస్తున్నామని వెల్లడించారు. ఎక్కడైనా చెరువులు, కాల్వలకు గండ్లు పడితే వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న పెద్దచెరువు గట్టు తెగిందంటూన్న వస్తున్న వందులు నమ్మవద్దని తెలిపారు.

గ్రామసభలో సామాజిక తనిఖీ

బొబ్బిలి రూరల్: మండలంలోని కమ్మవలసలో ఆదివారం గ్రామ సర్పంచ్ పిల్లా వసుంధర అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజుల పాటు కూలీలు చేసిన పనులను పరిశీలించి, గ్రామసభ ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో వివరించారు. పంచాయతీ కార్యదర్శి మధు, వార్డు మెంబర్స్, వెల్ఫేర్ అసిస్టెంట్, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని..

● యువకుడి ఆత్మహత్య


రాంబాబు (ఫైల్)

బొండపల్లి: మద్యం తాగాడని తండ్రి మందలించడతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొండకిండాం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ యు.మహేష్ వివరాల మేరకు.. కొండకిండాం గ్రామానికి చెందిన కలిశెట్టి రాంబాబు (36) అనే వ్యక్తి నెల రోజుల నుంచి మ ద్యానికి బానిసయ్యాడు. దీంతో తల్లిదండ్రులు ఆయనతో మద్యం మాన్పించారు. అయితే, ఈ నెల 5న రాంబాబు మళ్లీ మద్యం తాగాడు. దీంతో తండ్రి రామ్మూర్తి మందలించడంతో మనస్తాపానికి గురైన రాంబాబు శనివారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. రాంబాబుకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి రామ్మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తారాపురం గ్రామానికి చెంది న రేగు తవుడు(59) చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గడ్డిమందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే తవుడును విజయనగరం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీపురుపల్లి: రాజాం పట్టణంలోని డోలపేటకు చెందిన తలచింతల శంకర్ (37) అనే వ్యక్తి శనివారం రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శంకర్ విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చే స్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లాల్సి ఉండడంతో చీపురుపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి రెండో నంబరు ప్లాట్‌ఫాంకి వచ్చేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

గరివిడి: తన చిన్న కుమార్తె పల్ల శైలజ అదృశ్యమైనట్లు గరివిడి యా దవ వీధికి చెందిన ఆమె తండ్రి ఆదిబాబు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 5న ఉదయం 9 గంటలకు శైలజ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు రాలేదని ఆదిబాబు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గరివిడి పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తవలస ఎస్ఐ మృతి


వెంకటేశ్వరరావు (ఫైల్)

కొత్తవలస: కొత్తవలస పోలీసుస్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావు(58) శనివారం మృతి చెందారు. గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వెంకటేశ్వరరావు విశాఖపట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వెంకటేశ్వరరావు స్వస్థలం పాడేరు. 1990వ సంవత్సరంలో పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిన వెంకటేశ్వరరావు అంచలెంచలుగా పదోన్నతులు పొంది వివిద పోలీసు స్టేషన్లలో పని చేశారు. ఎస్ఐ మృతి చెందారనే విషయం తెలుసుకున్న వెంటనే సీఐ షణ్ముక రావు, సిబ్బంది వెళ్లి నివాళులు అర్పించారు. వెంకటేశ్వరరావు మృత దేహానికి ఆదివారం పాడేరులో అంత్య క్రియలు నిర్వహించారు.

లక్ష్మీ గణపతి స్వామికి మహా కుంబాభిషేకం

రాజాం: మండలం మొగిలివలస గ్రామంలో కాశీ విశ్వేశ్వర ఆలయంలో శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి అస్టోత్తర శతకలశ మహా కుంభాబిషేకం ఆదివారం జరిగంది. అర్చకులు కామేశ్వర స్వామి వేదమత్రోత్సరన తో శతకలశ కుంబాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి శతకలశ అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాచ్చెరువు గండి పూడ్చిన రెవెన్యూ అధికారులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట రెవెన్యూ అధికారులు ఆదివారం స్థానిక రాచ్చెరువు గండిని పూడ్చారు. శనివారం రాత్రి నుంచి పడుతున్న వర్షాలకు పుణ్యగిరి గెడ్డ నుంచి నీరు అధికంగా వస్తుండడంతో రాచ్చెరువుకు వరద నీరు చెరుతోంది. వరద నీరు కిందకు పంపించే చప్టానుంచి సక్రమంగా నీరు పారకపోవడంతో చెరువు గట్లు అంచుకు నీరు చెరింది. చప్టా సమీపంలో ఓచోట గండిపడేందుకు సిద్ధంగా ఉండడాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. తహసీల్దార్ అరుణకుమారి దృష్టిలో పెట్టడంతో గ్రామ రెవెన్యూ అధికారులు కన్నయ్య, ఎస్.రమణతో కలసి పరిశీలించారు. గండిపడకుండ ఇసుక బస్తాలతో కప్పారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి రాచ్చెరువు గట్టుకు చేరుకున్నారు. తహసీల్దార్‌తో చర్చించారు. రెవెన్యూ అధికారులకు సహకారం అందించాలని తెలుగుదేశం కార్యకర్తలకు ఆదేశించడంతో గండి పూడ్చేపనిలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాలుపంచుకున్నారు. ● **లక్కవరపుకోట:** మండలంలో తలారి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మరోతు రామారావు శనివారం ఉదయం పాము కాటుకు గురయ్యారు. పొలంలో కూలీలు వరి పంటలో కలుపు తీస్తుండగా పంటకు నీరు పెడదామని రామారావు వెళ్లారు. గట్టుపై నడుస్తుండగా గుర్తుపట్టని పాము కరిచింది. వెంటనే పొలంలో ఉన్న కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఎస్.కోట సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకు మారి ఆసుపత్రికి వెళ్లి రామారావును పరామర్శించారు.


ఎమ్మార్వోకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సాలూరు రూరల్: మండలంలోని తీనుసామంత వలస లో విద్యుదాఘాతంతో శనివారం రాత్రి గిరిజన మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. తీనుసామంత వలస గ్రామానికి చెందిన సీదరపు ఇందిరమ్మ (50) వర్షం వల్ల ఇంట్లో ఇనుప తీగపై బట్టలు ఆరబెట్టింది. కొద్దిరోజులు గా కురుస్తున్న వర్షాలకు గోడ తడడంతో ఆమె తీగెను పట్టుకొని బట్టలు తీయడానికి ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గు రైంది. దీంతో బంధువులు ఆటోలో మామిడిపల్లి పీహెచ్ సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకె ళ్లగా వైద్యులు పరీక్షించి ఆమె మరణించినట్టు ధ్రువీకరించారు. ఈ మేరకు కుమార్తె చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి సాలూ రు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు ముగ్గురు కుమా ర్తెలు ఉన్నారు. వారిలో అనూష అన్నంరాజువలస ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వ ర్తిస్తున్నారు. కాగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇందిరమ్మ కుటుంబాన్ని ఆదుకుంటా మని మంత్రి గు మ్మిడి సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి, ధైర్యం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లక్కవరపుకోట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్లివీడు సమీపంలోని కొత్త గంగుబూడి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగుబూడికి చెందిన లెంక సతీష్ (45) మృతిచెందాడు. సతీష్ ద్విచక్రవాహనంపై విశాఖవైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదుపు తప్పి ముందు వెళుతున్న కారును బైక్‌తో ఢీకొన్నాడు. ఘ టనలో తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం కొత్తవలస ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందినట్టు తెలిపారు. సతీష్ గంగుబూడి ఉప సర్పంచ్‌గా గతంలో పనిచేశాడు.

వాకిట్లోకి దూసుకెళ్లిన కారు.. వృద్ధుడి మృతి

బొండపల్లి: మండలంలోని అంబటివలస సంతోషిమాత ఆలయం పక్కన ఉన్న ఇంటి వాకిట్లోకి కారు దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వాకిట్లో నిల్చొని ఉన్న నెమ్మాది అప్పలనాయుడు (69) అనే వృద్ధుడిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఒడిశా రిజిస్ట్రేషన్ కలిగిన ఈ కారులో వాహన యజమాని తన భార్యాబిడ్డలతో గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఆయన తన భార్యా బిడ్డలను విడిచి పరారయ్యాడు. గాయపడిన భార్యాబిడ్డలు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం ఊటల ధ్వంసం

సీతంపేట రూరల్: మండలంలోని నారాయణగూడ సమీపంలో పోలీసుల దాడుల్లో 960 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. ఆదివారం తనిఖీల్లో భాగంగా ఊటలను గుర్తించినట్లు చెప్పారు. ● అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను గుర్తించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఆదివారం వాహన తనిఖీల్లో భాగంగా అధికలోడుతో వెళ్తున్న ఐదు ఆటోలను గుర్తించామని తెలిపారు.

కొలువుదీరిన గణనాథులు

● భక్తిశ్రద్ధలతో మండపాల్లో ప్రత్యేక పూజలు


కురుపాం రూరల్: మొండెంఖల్‌లో కొలువుదీరిన వినాయకుడు


కురుపాం: వంగర వీధిలో..

జిల్లాలోని 15 మండలాలు, పార్వతీపురం, సాలూరు, పాలకొండ పట్టణాల్లో శనివారం వినాయకచవితి ఘనంగా నిర్వహించారు. వాడవాడలా గణనాథులను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.


పార్వతీపురం ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి విజయవాడలో వినాయకుని పూజలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి


వీరఘట్టం: పట్టణంలో..


పార్వతీపురం టౌన్: వినాయకుని విగ్రహాన్ని మండపానికి తీసుకువెళ్తున్న కమిటీ సభ్యులు


పాచిపెంట: మండపానికి గణనాథుని తరలిస్తున్న సాలాపు వీధి యువకులు


సాలూరు రూరల్: సాలూరులో గణేష్ విగ్రహాల తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం


పార్వతీపురం ఆంధ్రజ్యోతి: మండలంలోని నర్సిపురంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర


గరుగుబిల్లి: ఉల్లిభద్రలో వినాయకుడిని ఊరేగింపుగా మండపానికి తరలిస్తున్న యువకులు


సీతంపేట: బస్టాండ్ వద్ద వినాయక విగ్రహం ఏర్పాటు..


గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


భామిని: వినాయకుని మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పాలకొండ: పట్టణంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

● ఆర్టీసీ ఈయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు


గేటు ధర్నా నిర్వహిస్తున్న ఈయూ నాయకులు

పార్వతీపురంటౌన్: కండక్టర్లపై 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా పార్వతీపురం డిపోమేనేజర్ దుర్గాదేవి అక్రమ సస్పెన్షన్లు ఎత్తి వేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పార్వతీపురం డిపోగేటు వద్ద అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్న కండక్టర్లు గణపతి, అప్పన్న, ఎంఎస్‌మణిలను అక్రమంగా సస్పెండ్ చేయడం బాధకరమన్నారు. డిపోమేనేజర్ దుర్గాదేవి వైఖరి వల్ల ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డిపో మేనేజర్ వైఖరి మారకపోతే కార్మికులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.నర్సింగరావు, అధ్యక్షులు డి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

వరద సహాయ కార్యక్రమాల్లో నిమగ్నం

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: విజయవాడలో వరద సహాయ కార్యక్రమాల్లో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నిమగ్నమయ్యారు. బాధితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. బాధితుల సమస్యలను పరిష్కరిస్తూ తనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేటాయించిన బాధ్యతలను చేపట్టారు. ఆమె వినాయకచవితిని కూడా శనివారం విజయవాడలో నిర్వహించారు.

గిజబలో అన్నసమారాధన

గరుగుబిల్లి: మండలంలోని గిజబలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీసభ్యులు మరడాన సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యులు మండల శంకరరావు, మరడాన గౌరీశంకరరావు పాల్గొన్నారు.

కొండశిఖర గ్రామాల రహదారులకు ప్రణాళిక

గుమ్మలక్ష్మీపురం: కొండ శిఖర గ్రామాలకు రహదారుల నిర్మాణాలకు ఐటీడీఏ ద్వారా ప్రణాళికకు సిద్ధం చేస్తున్నట్లు భద్రగిరి అసిస్టెంట్ ఇంజనీర్ అప్పారావు తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో రోడ్లకోసం ప్రణాళికను గిరిజన సంక్షేమశాఖకు పంపనున్నారు. రహదారులు లేని కొండశిఖర గ్రామాలను గుర్తిస్తున్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఈ గ్రామాలకు తారురోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు.


సుభద్ర యోజన రథం ప్రారంభం


జెండా ఊపి రథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బిభుతిభూషణ్ జెన్నా

రాయగడ: రాయగడ జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడామైదానం రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఉక్కు, గనుల శాఖామంత్రి బిభుతిభూషణ్ జెన్నా సుభద్ర యోజన రథం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. మహిళల ఖాతాల్లో ప్రతి ఏడాది రాఖీ పౌర్ణమి రోజు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు రూ.ఐదు వేలు చొప్పున జమచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వారి, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి నిహార్ రంజన్ కహార్, సబ్‌కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ప్రతిమ ప్రధాన్, స్వయం సహాయక సంఘాలు, సూపర్‌వైజర్లు అధికారులు పాల్గొన్నారు.

10న స్పందన సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవం

రాయగడ: స్పందన సాహితి సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవం నవంబరు పదో తేదీన నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరి ప్రసాద్ తెలిపారు.రాయగడలోని స్పందన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పద్యపఠనం, విచిత్ర వేషధారణ పోటీలు, అన్నమయ్య కీర్తనలు, సినీపాటల పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ పతివాడ తులసీదాస్, కేకేఎంపట్నాయక్ భళ్లమూడి నాగేశ్వరరావు, పిల్లల శంకరరావు, సింగిడి రామరావు, బాబురావు మహంతి,లాడి సతీష్‌కుమార్, చిన్నారి చక్రధర్, పీఎంజీ శంకరరావు, మామిడి గణపతిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరిప్రసాద్


సీతంపేట రూరల్: కుసిమి రహదారిపై ప్రవహిస్తున్న సంతమల్లి గెడ్డ


సీతంపేట: వర్షంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న గిరిజనులు

ఏజెన్సీలో ఎడతెరిపిలేని వర్షాలు

● అప్రమత్తమైన అధికారులు ● జనజీవనం అస్తవ్యస్తం

ఏజెన్సీలో వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలాశయాలకు వరద వచ్చే ప్రమాదం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పలుచోట్ల రోడ్లపై నుంచి వర్షం నీరు ప్రవహించింది. కుండపోత వర్షం వల్ల జనజీవనం అస్తవ్యస్తమయ్యింది.

● **సీతంపేట రూరల్:** సీతంపేట ఏజెన్సీలో కుండపోత వర్షం కురిసింది. శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని తొత్తడి, సంతమల్లి మధ్యలో ఉన్న గెడ్డ పొంగి రహదారిపై నుంచి ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

●**సీతంపేట:**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆదివారం జరిగిన వారపు సంతలో అటవీ ఉత్పత్తుల విక్రయానికి గిరిజనులు ఇబ్బంది పడ్డారు. సీతాఫలం, నిమ్మకాయలు, కొండచీపుర్లు, అల్లం, పసుపు సీజన్ కావడంతో వాటిని అమ్ముకోవడానికి కొండశిఖర ప్రాంతాల నుంచి ఆదివాసీలు వర్షంలో తడుచుకుని సంతకు వచ్చారు. ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్ కావడంతో తక్కువ ధరకు కొనుగోలు చేశారు. గత వారం రూ.1500 నుంచి రూ.2 వేలు వరకు కావిడి సీతాఫలం ధర ఉండేది. వర్షాల వల్ల వాటి 600 రూపాయలకు పడిపోయిందని గిరిజనులు వాపోయారు.

● **గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో 24 గంటలుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో ఏజెన్సీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందిపడుతున్నారు.కాగా తుఫాన్‌నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అప్పారావు కోరారు. పాడుపడిన ఇళ్లలో ఉండవద్దని వాగులు, గెడ్డలు దగ్గరకు వెళ్లవద్దని, కొండ చర్యలు విరిగిపడే ప్రమాదం ఉన్న చోట ఉండవద్దని తెలిపారు.

● **వీరఘట్టం:** మండలంలోని కిమ్మి గ్రామం వద్ద ఉన్న నాగావళి నదిని ఆదివారం తహసీల్దార్ లక్ష్మీనాయుడు పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నదీ ప్రవాహం పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతానికి నదీ ప్రవాహం తక్కువగా ఉందని తెలిపారు. నదీపరిసరాలకు వెళ్లవద్దని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగావీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో తుఫాన్ వల్ల ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ముందుజాగ్రత్తగా రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు.

● **సాలూరు:** వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆదివారం స్థానిక విలేకరు లతో విజయవాడ నుంచి ఫోన్‌లో మాట్లాడారు. ఇంత విపత్తులో ముఖం చూపించి జగన్ బెంగళూరు పారిపోయారని విమర్శించారు.

●**భామిని:** నదీతీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ శేఖరం కోరారు. ఆదివారం బత్తిలి, కాట్రగడ, నేరడి, బిల్లుమడ, లివిరి, తాలాడ, కీసలి, కోసలి నదీతీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వీఆర్‌ఏలకు సూచించారు. నదిలో పడవలు నడుపుతున్న వారిని కార్యాలయాలకు పిలిపించి, వారితో మాట్లాడారు. నేరడి, పసుకుడి, తాలాడ వద్ద నదుల్లో పడవలు నడపవద్దని సూచించారు. భామినిలో మట్టిగోడను పరిశీలించి తొలగించాలని ఆ ఇంటి యజమానిని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు బంటు దాసు ఆధ్వర్యంలో విరాళాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయాన్ని బాధితులకు అందించాలని పిలుపునిచ్చారు.

బాధితులకు అండగా ఉండాలి

వరద బాధితులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారంగా ఏదో ఒక రూపంలో అండగా ఉండాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. నర్సిపురంలో కొమరాడ మండలంలో రెవెన్యూశాఖలో కంప్యూటర్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్న గణేష్ రూ.16 వేలు అందంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోను దేవి చంద్రమౌళి, బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు పాల్గొన్నారు.


అడ్డాపుశీలలో విరాళాలు సేకరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అధికారుల పర్యవేక్షణలో మరబోట్లు నడపాలి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి డిమాండ్

కొమరాడ /జియ్యమ్మవలస: నాగావళి నదిలో అధికారుల పర్యవేక్షణలో మరబోట్లు నడపడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడ మండలంలో నాగావళి నది ఆవల ఉన్న తొమ్మిది పంచాయతీల ప్రజలను అధికారులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం పూర్ణపాడు- లాబేసు వంతెన సమీప పలు గ్రామాల ప్రజలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇంతవరకు మరబోట్లుపై నది ఈవల ఉన్న కొమరాడకు ప్రజలు వచ్చేవారన్నారు. ప్రస్తుతం వరద ఉధృతి వల్ల రెవెన్యూ, పోలీస్‌శాఖలు మరబోట్లును ఆపడం సమంజసమే కానీ ప్రస్తుతం ఒడిశా నుంచి వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మరబోట్లు నడపాలని, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు జారీచేయాలని డిమాండ్ చేశారు. పూర్ణపాడు -లాబేసు వంతెన పనులు 18 ఏళ్లుగా నత్తనడకన సాగుతుండడంతో నాగావళి ఆవల ఉన్న ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. మండల కేంద్రానికి చేరుకోవడానికి పెదమేరంగి మీదుగా పార్వతీపురం వెళ్లి అక్కడ నుంచి 70 కిలో మీటర్లు ప్రయాణించాలివస్తోందని తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చొరవ చూపి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద బాధితులను ఆదుకోవాలి

● విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరీశ్వరరావు


మాట్లాడుతున్న గౌరీశ్వరరావు

గరుగుబిల్లి: విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు తమ సంఘం తరపున తీర్మానించినట్లు విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు తెలిపారు. ఆదివారం ఎర్రన్నగుడి జంక్షన్‌లో జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలో వరద బాధితులను విశ్వబ్రాహ్మణ సంఘం తరుపున ఆదుకోవాలని కోరారు. సమావేశం లో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయ కులు కె.తిరుపతిరావు, ఇ.కాశీవిశ్వేశ్వరరావు, చింతాడ తవిటాచారి పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు: సీఐ

సాలూరు రూరల్: వినాయకఉత్సవాలు తొమ్మిదిరోజులకు మించి నిర్వహించకూడదని సాలూరు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు వినాయక మండపాలకు వద్ద వెళ్లి నిర్వాహకులకు ఉత్సవ నిర్వహణపైవివరించారు. శనివారం విగ్రహాలు తీసుకొచ్చే సమయంలో మూడు వీధుల్లో జరిగిన అవాంఛనీయ సంఘటనలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.అనుపోత్సవం పురస్కరించుకుని డీజేలు, అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్స్‌లను అనుమతించబోమని చెప్పారు. నిమజ్జనం పురస్కరించుకుని పిల్లలను చెరువులు, వేగావతి నది వద్దకు తీసుకెళ్లరాదన్నారు. ఆయనతో పట్టణ ఎస్‌ఐ సీతారాం తదితరులు ఉన్నారు.

ఉద్యాన కళాశాలకు గుర్తింపు తీసుకురావాలి

గరుగుబిల్లి: ఉల్లిభద్రలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషిచేయాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ కోరారు. ఆదివారం కళాశాలప్రాంగణంలో పదోన్నతిపై బదిలీపైవెళ్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్‌ను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రారంభం నుంచి ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు మెరుగైన బోధన అందించినట్లు తెలిపారు.ఇన్‌చార్జి అసోసియేట్‌డీన్ డాక్టర్ బి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు సక్రమంగా నిర్వహించి మెరుగైన సౌకర్యాలు కల్పనకుకృషి చేస్తానని చెప్పారు. అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వహించారని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషనర్‌గా నియమించడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఈ-పంట పూర్తికి చర్యలు: ఏవో

గరుగుబిల్లి:ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట బుకింగ్ ఈనెల 15వ తేదీకి పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఏవో ఆర్.విజయభారతి తెలిపారు. ఆదివారం తోటపల్లి వద్ద ఈ-క్రాప్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు విక్రయించేందుకు, ప్రభుత్వపథకాలు, ప్రకృతి వైపరీత్యాల్లో పంటలకు నష్టం వాటిల్లితే పరిహారానికి ఈ-క్రాప్ అవసరమన్నారు. రైతుసేవా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఈ-క్రాప్ నమోదుపై సూచనలు,సలహాలను ఇస్తున్నారని తెలిపారు.ఈ-క్రాప్‌ను త్వరగా పూర్తి చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఇప్పటికే తెలియజేశామని పేర్కొన్నారు. ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవలసి ఉందని తెలిపారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణ ప్రజలకు సోమవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మునిసిపల్ అధికారులు తెలిపారు. మునిసిపాలిటీలో గల ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద ఇన్‌ఫిల్ట్రేషన్ బావిలో గల మోటారు పాడవడంతో సోమవారం తాగునీటి సరఫరా జరగదని, ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో భారీ వర్షాలు నేపథ్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలకోర్చి గ్రీవెన్స్‌కు రావద్దని కోరారు.

కుక్కల స్వైరవిహారం

జియ్యమ్మవలస: మండలంలో కన్నపుదొరవలస, బిత్రపాడు పంచాయతీల్లో శని, ఆదివారాల్లో కుక్కలు మరోసారి స్వైరవిహారం చేశాయి. శనివారం సాయంత్రం బిత్రపాడు గ్రామానికి చెందిన బోను ప్రసాద్‌పై బట్లభద్ర సమీపంలో కూరాకుల మడి వద్ద ఉన్న పంట పొలాలు పరిశీలించేందుకు వెళ్లగా తీవ్రంగా గాయపరిచాయి. ఆ సమయంలో మరో ఇద్దరు రావడంతో అక్కడి నుంచి కుక్కలు వెళ్లిపోయాయి. ఆదివారం ఉదయం సుభద్రమ్మవలసకు చెందిన దుక్క తిరుపతి, యలమంచలి శ్రీనపై గ్రామ సమీపంలోనే దాడికి యత్నించగా, వాటిని కర్రలతో తరిమేశారు. ఈ నేపథ్యంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో కన్నపుదొరవలస, గవరమ్మపేట, బాసంగి, బిత్రపాడు, నిమ్మలపాడు పంచాయతీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశిల పంచాయతీ పరిధిలో గల చలంవలసకు చెందిన జవ్వాది పార్థసారధి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని వైసీపీ నాయకులు అందించారు. పార్థసారధి అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరిక్షిత్తురాజు తదితరులు పాల్గొన్నారు.